ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

5
సిద్దిపేట
మంగళవారం 23 సెప్టెంబరు 2025



● బాలత్రిపురసుందరి దేవిగా...

వర్గల్ విద్యాధరి క్షేత్రంలో అమ్మవారి శరన్నవరాత్రోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు విద్యాసరస్వతీ అమ్మవారు శ్రీ బాలత్రిపురసుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నాచారం శ్రీక్షేత్రం పీఠాధిపతులు శ్రీ మధుసూదనానంద సరస్వతీ స్వామిజీ హాజరై అమ్మవారికి పూజలు చేశారు. శరన్నవరాత్రి మహోత్సవాలను చంద్రశేఖరశర్మ సిద్ధాంతి దంపతులు, ఆలయ వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య అంకురార్పన చేశారు.

- వర్గల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి)

సంగారెడ్డి రాజీవ్‌పార్క్ అభివృద్ధికి
రూ.3 కోట్లు మంజూరు చేయించిన జగ్గారెడ్డి, నిర్మల

- కన్సల్టెన్సీ, డిజైన్, ఆర్కిటెక్ ప్రతినిధులతో కలిసి రాజీవ్‌పార్క్‌ను పరిశీలించిన జగ్గారెడ్డి, నిర్మల
- పదేళ్లపాటు నిరుపయోగంగా ఉన్న రాజీవ్‌పార్క్‌ను నెల రోజుల్లో అన్ని సౌకర్యాలతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి
- అక్టోబరు 25 లోపు పనులు పూర్తికావాలి
- వచ్చే నెలలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా మళ్లీ రాజీవ్‌పార్క్ ప్రారంభోత్సవం




సంగారెడ్డి రాజీవ్‌పార్క్ అభివృద్ధిపై సూచనలిస్తున్న జగ్గారెడ్డి, నిర్మల, పార్క్‌లో నిరుపయోగంగా ఉన్న ఫౌంటెయిన్‌ను పరిశీలిస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలో పదేళ్లపాటు నిరాదరణకు గురైన రాజీవ్‌పార్క్‌ను సోమవారం టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలతో పాటు కన్సల్టెన్సీ, డిజైన్, ఆర్కిటెక్ ప్రతినిధులతో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ 2004లో తాను ఎమ్మెల్యేగా ఎన్నికవగానే 2005లో బొబ్బిలికుంట పక్కనే ఉన్న స్థలంలో రాజీవ్‌పార్క్‌కు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. అప్పటి ముఖ్యమంత్రులు రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో రాజీవ్ పార్క్ పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో రాజీవ్ పార్క్‌లో మ్యూజికల్ ఫౌంటెయిన్, చిల్డ్రన్స్‌పార్క్, ప్లేయింగ్ ఏరియాలను ఏర్పాటు చేయించానని తెలిపారు. 2014 నుంచి పార్కు నిరాదరణకు గురైందన్నారు. ఇటీవల మున్సిపల్ డీఎంఏ శ్రీదేవిని కలిసి రాజీవ్‌పార్క్ అభివృద్ధి కోసం రూ.15 కోట్ల ప్రతిపాదనలు అందజేస్తే, అత్యవసర పనుల కోసం రూ.3 కోట్లు మంజూరు చేశారని తెలిపారు.

'108' సిబ్బందిపై
కినుక ఎందుకో?
- శిథిలావస్థలో ఉన్న భవనమే వారి ఆవాసం
- నిత్యం పాములు, తేళ్ల సంచారంతో గుబులు
- హుస్నాబాద్‌లో కనీస సౌకర్యాలకు నోచుకోని వైనం

8

అద్దెబస్సు డ్రైవర్ల
వేతనాలు పెంచాలి
8

గీతంలో ప్రధానోపాధ్యాయుల
సంగోష్ఠి
7

అడివమ్మ ఒడిలో ఒదిగిన
రామన్న

- అబుజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో కాతా రామచంద్రారెడ్డి హతం
- కోహెడ మండలం తీగలకుంటపల్లి స్వగ్రామం
- 35 ఏళ్ల క్రితం ఉపాధ్యాయ ఉద్యోగం వదిలి అజ్ఞాతంలోకి
- కేంద్ర కమిటీ సభ్యుడిగా కీలక స్థానం
- రాజుదాదా, గుడ్సా ఉసెండీ, విజయ్, వికల్ప్‌గా గుర్తింపు
- ఉమ్మడి జిల్లాలో ఇక మిగిలింది నలుగురే

సిద్దిపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పీడిత, తాడిత ప్రజల కోసం ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాన్ని వదిలి అడవిబాట పట్టిన ఆ అడుగుల శబ్దం ఆగిపోయింది. జనం సమస్యలే తన సమస్యలుగా భావించి పోరుకు సై అంటూ నినదించిన ఆ గొంతు మూగబోయింది. 35 సంవత్సరాల తన అజ్ఞాతవాసానికి మరణం రూపంలో సెలవు దొరికింది. అలుపెరుగని విప్లవ వీరుడు కాతా రామచంద్రారెడ్డి అలియాస్ రాజు దాదా, గుడ్సా ఉసెండీ, విజయ్, వికల్ప్... మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా కీలక స్థానంలో పనిచేస్తూ నేలకొరిగారు. ఆయనపై రూ.40 లక్షల రివార్డు ఉంది. ఆయన మృతితో స్వగ్రామం సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తీగలకుంటపల్లి విషాదం అలుముకుంది. విప్లవ ఉద్యమాలతో ఇటు హుస్నాబాద్ ప్రాంతానికి.. అటు ఉమ్మడి మెదక్ జిల్లాకు విడదీయరాని బంధం ఉంది. హుస్నాబాద్, కోహెడ మండలాల్లో ఆనాడు భూపతి, పద్మక్క, సందెవేన రాజమౌళి అలియాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో పీపుల్స్‌వార్ దళాలు పనిచేశాయి. నాడు విప్లవపోరుపై ఆసక్తి చూపించి కాతా రామచంద్రారెడ్డి పీపుల్స్‌వార్‌లో చేరారు. సాధారణ దళ సభ్యుడి నుంచి అంచెలంచెలుగా కేంద్ర కమిటీ సభ్యుడి వరకు ఎదిగారు. ఇకనైనా తమ కన్నకొడుకు ఇంటికి రాకపోతాడా అంటూ ఎదురు చూసిన తల్లిదండ్రులు వజ్రవ్వ, మల్లారెడ్డిలకు కన్నీళ్లే మిగిలాయి. ఆయన భార్య శాంతి, కూతురు, కొడుకు హైదరాబాద్‌లో ఉంటున్నారు.



రామచంద్రారెడ్డి (ఫైల్)

ఒక్కొక్కరిగా నేలవాలుతూ..

అప్పట్లో దుబ్బాక, నర్సాపూర్, గిరాయిపల్లి, ఇందుప్రియాల్, హుస్నాబాద్ పీపుల్స్‌వార్ దళాలు పనిచేశాయి. కూడవెల్లి, మంజీర దళాల పేరిట జనశక్తి హవా నడిచింది. దేశంలోనే మొదటి ఎన్‌కౌంటర్ మెతుకుసీమలోని గిరాయిపల్లిలో జరిగింది. నాలుగు దశాబ్దాల పోరాటంలో హుస్నాబాద్ ప్రాంతం సహా, ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వందలాది మంది అడవిబాట పట్టారు. కొందరు నేలకొరగగా.. మరికొందరు లొంగిపోయారు. నాటి పీపుల్స్‌వార్ నక్సల్స్‌గా, ఆ తర్వాత మావోయిస్టు పార్టీలో కీలకంగా వ్యవహరించిన నేతల్లో చాలామంది ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి తమ ప్రస్థానం ప్రారంభించినవారే. శాఖమూరి అప్పారావు, సోలిపేట కొండాల్‌రెడ్డి, రావుల శ్రీనివాస్, దుబాషి శంకర్ కేంద్ర, రాష్ట్ర కమిటీలకు ప్రాతినిధ్యం వహిస్తూ నేలకొరిగారు. ఇక జనశక్తి గ్రూపులోనూ డేగల సుభాష్, రియాజ్, సంగన్న, భీమన్న దళాలూ మెతుకుసీమ పల్లెల్లో హవా సాగించాయి. గిరాయిపల్లితోపాటు మేదినీపూర్, ఏడుపాయల, రామాయంపేట, ఇందుప్రియాల్, సీతారాంపల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్లలో పెద్దసంఖ్యలో నక్సల్స్ చనిపోయారు. తాజాగా రామచంద్రారెడ్డి ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగారు.

గత విప్లవమెంతో ఘనం

సిద్దిపేట జిల్లా కొండపాక మండలం గిరాయిపల్లి గుట్టల్లో 1975లోనే ఎన్‌కౌంటర్ జరిగింది. దీనిని దేశంలోనే

మిగతా 7వ పేజీలో



కాతా రామచంద్రారెడ్డి తల్లిదండ్రులు



హుస్నాబాద్‌లో బతుకమ్మ ఏర్పాట్లపై మాట్లాడుతున్న పొన్నం

అమెరికా దౌత్య సంబంధాల్లో
కేంద్ర ప్రభుత్వం విఫలం

● మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అమెరికాతో దౌత్య సంబంధాల్లో కేంద్రం విఫలమైందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా దేశానికి సంబంధించి నిబంధనలు చదువుకోవడానికి వెళ్లే మనవాళ్లకు ఆటంకం కలిగిస్తున్నదన్నారు. అమెరికా ఇతర దేశాల్లో మనదేశానికి చెందిన 100 మంది వరకు సీఈవోలున్నారని, వారి తెలివి తేటలు ఇక్కడ పెట్టాలని, ప్రభుత్వాలు వారికి రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలుకుతాయన్నారు. విదేశాల్లో ఉన్నవారు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని, గ్రామీణ ప్రాంతాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని కోరారు.

అన్నిచోట్లా ఏర్పాట్లు చేయాలి

బతుకమ్మ ఉత్సవాలు, దేవీ నవరాత్రులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీఎం ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో ఏర్పాట్లు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్లు, పంచాయతీరాజ్ అధికారులు, గ్రామ కార్యదర్శులు, గ్రామ పరిపాలన అధికారులతో సమీక్షిస్తున్నట్లు చెప్పారు. సోమవారం హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువుపై ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం చేపట్టాల్సిన ఏర్పాట్లపై అఖిలపక్ష నాయకులతో చర్చించారు. పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో సతీసమేతంగా ప్రత్యేక పూజలు చేశారు.

ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి : కలెక్టర్

సిద్దిపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బతుకమ్మ పండుగను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టాలని, ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ లైట్లతో ముస్తాబు చేయాలన్నారు.

నవశకానికి
నాంది
నర్మెటలో పామాయిల్ ఫ్యాక్టరీ

- ఆనందభాష్పాలు వచ్చాయి ● ఈ ప్రాంత రైతుల దశదిశ మారుతుంది
- సర్కారు ఉద్యోగుల కన్నా అధిక ప్రయోజనం
- కలలను సాకారం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ది
- అభివృద్ధిలో కాంగ్రెస్‌ది ఆరో వేలు పాత్ర : మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



నర్మెటలోని ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి

సిద్దిపేట,సెప్టెంబరు 22 ఆంధ్రజ్యోతి ప్రతినిధి/నంగునూరు: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో ప్రారంభం కానున్న పామాయిల్ ఫ్యాక్టరీ ఈ ప్రాంత రైతుల జీవితాల్లో గేమ్ చేంజర్‌గా మారనుంది. ఒక్క సిద్దిపేట జిల్లాకే కాకుండా సుమారు పది జిల్లాల రైతులకు వరప్రదాయినిగా కానుంది. ఈ కర్మాగారం తుది దశకు చేరిన నేపథ్యంలో సోమవారం మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు.. దుబ్బాక, జనగామ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, వంటేరు యాదవరెడ్డితో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కరువుకాటకాలతో కకావికలమైన ఈ ప్రాంతంలో నిర్మించిన పామాయిల్ ఫ్యాక్టరీని చూడగానే తన కళ్లలో ఆనందభాష్పాలు వచ్చాయని ఉద్వేగానికి లోనయ్యారు. ఇది ఒక పరిశ్రమ మాత్రమే కాదని.. ఈ ప్రాంత రైతుల భావోద్వేగాలకు ప్రతిరూపమని వివరించారు. నవశకానికి నాందిగా ఈ ఫ్యాక్టరీ నిలవబోతోందని తెలిపారు. సిద్దిపేట జిల్లాతో పాటు చుట్టుపక్కల 10 జిల్లాలకు సంబంధించిన రైతుల దశదిశను మార్చే ఫ్యాక్టరీ అని చెప్పుకొచ్చారు. ఒకప్పుడు పామాయిల్ మొక్కను నాటాలంటేనే అనేక అపోహలు ఉండేవని.. ఈనాడు పోటీపడి నాటుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఎకరాకు యేటా రూ.లక్షన్నర ఆదాయం టంఛన్‌గా వస్తోందని వెల్లడించారు. సర్కారు ఉద్యోగులకైనా నెలకు ఒకసారి వేతనం వస్తే.. పామాయిల్ రైతులకు 21 రోజులకే ఖాతాల్లో జమ అవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో నిర్మించిన రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లతో గాలిలో తేమ శాతం పెరిగిందని వివరించారు. అందుకే ఆయిల్‌పామ్ సాగులో రైతులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని, ఆయిల్‌పామ్ తోటల వైపే మొగ్గు చూపుతున్నారన్నారు.



నర్మెట పామాయిల్ ఫ్యాక్టరీ ట్రయల్‌రన్‌లో తయారైన నూనెను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

రైతుల కలలను సాకారం తెలంగాణ అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీది ఆరో వేలు పాత్ర అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. చేతికి ఐదువేళ్లలాగా బీఆర్ఎస్ కష్టపడితే ఆరో వేలు వలె కాంగ్రెస్ ప్రభుత్వం నిరూపయోగంగా మారిందని దుయ్యబట్టారు. విత్తనాలు తాము నాటితే ఫలాలు మాత్రం కాంగ్రెస్ వాళ్లు తింటున్నారని.. తాము చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించడానికి సీఎం రేవంత్‌రెడ్డి జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నాడని విమర్శించారు. ఒకప్పుడు ఆయిల్‌పామ్ తోటలకు తెలంగాణ అనుకూలంగా లేదని ఐఐవోపీఆర్ సంస్థ తేల్చి చెప్పిందని గుర్తుచేశారు. కేసీఆర్ విజన్‌తో నిర్మాణమైన కాళేశ్వరం, సీతారామ, డిండి, పాలమూరు ప్రాజెక్టుల కారణంగా గాలిలో తేమశాతం పెరిగిందని వివరించారు. ఆ తర్వాత అద్భుతంగా పామాయిల్ సాగు చేస్తున్నారని.. ఇదంతా ప్రాజెక్టుల పుణ్యమేనని స్పష్టం చేశారు. మలేషియా టెక్నాలజీతో దేశంలో ఎక్కడా లేని విధంగా నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని నిర్మించడం తమకు గర్వంగా ఉందన్నారు. మళ్లీ అధికారంలోకి రాగానే జిల్లాకు ఒక పామాయిల్ పరిశ్రమను

మిగతా 7వ పేజీలో

జోరువాన

- జలమయమైన లోతట్టు ప్రాంతాలు...
- పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- గరిష్ఠంగా 90.5 మి.మీ వర్షపాతం నమోదు



సిద్దిపేటలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లలోకి చేరిన వర్షపు నీటిని ఎత్తిపోస్తున్న మహిళలు

సిద్దిపేట సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం జోరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతతో అల్లాడిన జనం కాస్త సేదతీరారు. పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సిద్దిపేట పట్టణంతో పాటు, అర్బన్ మండలం, కొండపాక, కొముర‌వెల్లి, నంగునూర్, అక్కన్నపేటలో భారీ వర్షం కురిసింది. చిన్నకోడూర్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల, తొగుట, కుకునూర్‌పల్లి, వర్గల్, నంగునూర్, గజ్వేల్, సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట తదితర ప్రాంతాల్లో మోస్తరు వాన

మిగతా 8వ పేజీలో



సిద్దిపేటలో కురుస్తున్న భారీ వర్షం

మండలం	వర్షపాతం (మి.మీలలో)
కొండపాక	90.5
సిద్దిపేటఅర్బన్	76.5
కొమురవెల్లి	76.0
అక్కన్నపేట	70.5
నంగునూర్	70.0
రాయపోల్	57.8
ధూలిమిట్ట	57.5
కుకునూర్‌పల్లి	51.0
మద్దూరు	47.8
చిన్నకోడూర్	46.8
తొగుట	43.8
వర్గల్	43.8
అక్బర్‌పేట-భూంపల్లి	36.8
కోహెడ	33.8
ములుగు	32.3



వర్గల్‌లో కురుస్తున్న వర్షం

విద్యుత్ డివిజన్ ఇంజనీర్ కార్యాలయంపై పిడుగు

జిల్లా కేంద్రంలోని విద్యుత్ డివిజన్ ఇంజనీర్ కార్యాలయంపై పిడుగు పడింది. ఆ సమయంలో కార్యాలయంలో ఆరుగురు సిబ్బంది పనిచేస్తున్నారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. పిడుగుపాటు వల్ల కార్యాలయంలోని ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. దాదాపు రూ.10లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.



కాలిపోయిన స్విచ్‌బోర్డు

గజ్వేల్ ఇరిగేషన్ శాఖకు 'చీఫ్' ఎక్కడ?

- 22 రోజులుగా ఖాళీగా పోస్టు..
- గజ్వేల్ సీఈ పరిధిలోనే భారీ ప్రాజెక్టులు

గజ్వేల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో కీలక పాత్ర పోషిస్తున్న గజ్వేల్ నీటిపారుదల శాఖకు గత 22 రోజులుగా చీఫ్ ఇంజనీర్ (సీఈ) లేకపోవడంతో ఆ శాఖ పనులు కుంటుపడ్డాయి. ఆగస్టు 31న సీఈ వి.శ్రీనివాస్ ఉద్యోగ విరమణ పొందినప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉంది. ఈ ప్రాంతంలోని రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ వంటి భారీ రిజర్వాయర్ల పర్యవేక్షణ, వాటికి అనుబంధంగా నిర్మించిన కాలువల నిర్వహణ బాధ్యతలను సీఈ కార్యాలయం చూసుకుంటుంది. అయితే, కొత్త నియామకం జరగకపోవడంతో కీలకమైన ఫైళ్లు, పనులన్నీ పెండింగ్‌లో పడిపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గజ్వేల్‌లో ఇరిగేషన్ వ్యవస్థను విస్తరించి, ఒక ఈఎన్‌సీ, ఒక సీఈ, నాలుగు సర్కిళ్లు, 14 డివిజన్లతో అతిపెద్ద కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం గజ్వేల్ పరిధిలో సిద్దిపేట, భువనగిరి, మెదక్ సర్కిళ్లు ఉన్నాయి.



మూసి వేసి ఉన్న గజ్వేల్ నీటిపారుదల శాఖ సీఈ కార్యాలయం

విచారణ భయమే కారణమా?

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం విచారణ చేపట్టిన నేపథ్యంలో ఇక్కడ పనిచేసేందుకు అధికారులు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో గజ్వేల్ ఈఎన్‌సీగా పనిచేసిన హరిరాంపై ఆరోపణలు, ఏసీబీ అరెస్టుల వంటి ఘటనలు అధికారులలో భయాందోళనలు సృష్టించాయి. ప్రాజెక్టు విచారణలో భాగంగా, ఇక్కడ పనిచేసిన పలువురు అధికారుల గురించి ఏసీబీ ప్రభుత్వానికి రహస్య నివేదికలు సమర్పించినట్లు సమాచారం. ఈ కారణాల వల్లనే సీఈ పోస్టును భర్తీ చేయడానికి అధికారులు

మిగతా 8వ పేజీలో

తీగబడుతున్నారు

కరెంటు వైర్లే టార్గెట్

పొలాల్లో బోరు మోటార్ల చోరీ

సోలార్ ఫెన్సింగ్ వైర్లు అపహరణ

వెంచర్లలో కరెంట్ వైర్ల గాయబ్

తాజాగా చేర్యాల మండలంలో కాపర్ వైర్ దొంగతనం



చేర్యాల మండలం ముస్త్యాల శివారులో చోరీ చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్

సంగారెడ్డి క్రైమ్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు బానిసలై, జల్సాలకు అలవాటు పడిన కొందరు దుండగులు డబ్బు కోసం దొంగతనాలకు తీగలపై తెగబడుతున్నారు. ఖాళీగా ఉన్న వెంచర్లలో విద్యుత్ వైర్లు, పంటపొలాల్లోని సోలార్ ఫెన్సింగ్, బోరు మోటార్లే వారి ప్రధాన లక్ష్యంగా మారాయి. రాత్రికి రాత్రే ఇవి మాయమవుతుండడంతో రైతులు, వెంచర్ల యజమానులు లబోదిబోమంటున్నారు.

రాత్రిపూట 'వైరల్' దొంగలు

సంగారెడ్డి జిల్లాలో కంది, ఇస్మాయిల్‌ఖాన్‌పేట, సదాశివపేటతో పాటు పలు మండలాల్లో వెంచర్ల నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ వెంచర్లలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు అమర్చిన వైర్లను దొంగలు లక్ష్యంగా చేసుకున్నారు. రాత్రిపూట సెక్యూరిటీ లేని వెంచర్లలో స్తంభాలపైకి ఎక్కి వైర్లను కోసేసి తీసుకెళ్తున్నారు. కరెంటు వైర్ల దొంగల తలనొప్పి రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. పంటల కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసి బోర్లు వేసుకుని, మోటార్లు బిగించుకున్న రైతులను ఈ దొంగతనాలు తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. సంగారెడ్డి మండలం ఇరిగిపల్లి, చింతల్‌పల్లి, గంజిగూడెం, అంగడిపేట, కలబ్‌గూర్, హాస్టల్‌గడ్డ వంటి గ్రామాల్లో రైతులు తమ పంటలకు రక్షణగా ఏర్పాటు చేసుకున్న సోలార్ ఫెన్సింగ్ వైర్లు, బోరు మోటార్లు తరచూ చోరీకి గురవుతున్నాయి. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామ శివారు, సలాక్‌పూర్ క్రాస్‌రోడ్డు సమీపంలో మంగళవారం రాత్రి దుండగులు 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారు.

అంతర్రాష్ట్ర ముఠాలు

ఈ దొంగతనాల వెనుక అంతర్రాష్ట్ర ముఠాలు ఉన్నాయి. ఏప్రిల్ 16న సంగారెడ్డి జిల్లా పోలీసులు సదాశివపేట మండలం మద్దికుంట చౌరస్తాలో 13 మంది ముఠా సభ్యులను సభ్యులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.2.2లక్షల విలువైన 778 కిలోల అల్యూమినియం ఎలక్ట్రికల్ వైరు, ఆటో ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు. వారిలో హైదరాబాద్ నగరానికి చెందిన ఇద్దరు ఉండగా, మిగతా అంతా బీహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారు. ఈ ముఠాలోనూ మరో నలుగురు పరారీలో ఉన్నారు. జూలై 12న సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి పోలీసులు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఐదుగురి ముఠా సభ్యుల్లోని ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 272 కేజీల కాపర్ వైర్, రూ.3.24 లక్షల నగదు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకోగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. ఈ ముఠాపై కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులగొట్టి కాపర్ వైర్‌ను దొంగలించిన కేసులు 185 ఉన్నాయి. అయినా ఉమ్మడి జిల్లాలో ఈ చోరీలు ఆగడం లేదు. తాజాగా చేర్యాల మండలంలో జరిగిన ఘటనతో స్పష్టమవుతోంది.

రైతుల ఆవేదన

వైర్లు, మోటార్ల దొంగతనంతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాను రెండుసార్లు బోరు మోటారును, సోలార్ ఫెన్సింగ్‌ను పోగొట్టుకున్నానని, దాదాపు రూ.60 వేల నష్టం వాటిల్లిందని సంగారెడ్డి మండలం చింతల్‌పల్లికి చెందిన రైతు వీరన్న వాపోయాడు. తన సోలార్ ఫెన్సింగ్ వైర్లు మూడు సార్లు చోరీకి గురయ్యాయని, దీంతో రాత్రిపూట నిద్ర కూడా పట్టడం లేదని ఇరిగిపల్లికి చెందిన రైతు మొగులయ్య సైతం ఆవేదన వ్యక్తం చేశారు. దొంగల బెడదతో తీవ్రంగా నష్టపోతున్నానని, పోలీసులు స్పందించి దొంగలను పట్టుకోవాలని కోరారు. గత సోమవారం పదుల సంఖ్యలో రైతులు సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో తమ గోడు వెళ్లబోసుకున్నారు. పోలీసులు తక్షణమే స్పందించి దొంగల ముఠాలను పట్టుకుని న్యాయం చేయాలని కోరుతున్నారు.



సదాశివపేట మండలం మద్దికుంట వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు, స్వాధీనం చేసుకున్న అల్యూమినియం వైర్లు(ఫైల్)

సీతాఫలాల కోసం వెళ్లి.. బావిలో పడి యువకుడి మృతి



జయరాం (ఫైల్)

అల్లాదుర్గం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కోసం సీతాఫలాలను తెంపేందుకు అడవికి వెళ్లిన యువకుడు వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. ఈ ఘటన అల్లాదుర్గం మండలంలోని కోమటికుంటలో సోమవారం వెలుగులోకి వచ్చింది. అల్లాదుర్గం ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... గొల్లకుంట గ్రామ పంచాయతీకి చెందిన బర్మావత్ జయరాం(30) ఆదివారం సీతాఫలాల కోసం సమీప అటవీ ప్రాంతానికి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించారు. సోమవారం ఉదయం మాందాపూర్ శివారులోని చెన్నయ్యకుంట చెరువు గట్టుపై అతని సీతాఫలాల గంప, దుస్తులు, సెల్‌ఫోన్ కనిపించాయి. అనుమానం వచ్చి ఈతగాళ్లతో వెతికించగా, మృతదేహం బయటపడింది. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సంగమేశ్వర తండాలో మహిళ..



నాగిబాయి(ఫైల్)

రేగోడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలుజారి వ్యవసాయ బావిలో పడి ఒక మహిళ మృతిచెందింది. ఈ ఘటన రేగోడు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సంగమేశ్వర తండాకు చెందిన నాగిబాయి(45) ఆదివారం మధ్యాహ్నం పొలంలో పని చేసుకుని కాళ్లు, చేతులు కడుక్కోవడానికి బావిలోకి దిగి పడిపోయి మృతిచెందినట్లు ఆమె భర్త శంకర్‌నాయక్ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



కృష్ణ(ఫైల్)

రాయికోడ్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): చాకిరి వాగు దాటుతుండగా గల్లంతైన వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. రాయికోడ్ మండలంలోని కుస్నూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ కృష్ణ(42) ఆదివారం సాయంత్రం వాగు దాటుతుండగా కాలుజారి కొట్టుకుపోయాడు. సోమవారం ఉదయం ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలించగా కుస్నూర్ శివారులో పొదల మధ్య చిక్కుకుని ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. కృష్ణకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మృతుడి భార్య జన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైన్స్‌లో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

నర్సాపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని ఓ మద్యం దుకాణం వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం దాసరి నర్సింలు (34) ఆదివారం సాయంత్రం మరికొందరితో కలిసి నర్సాపూర్‌కు వచ్చి శ్రీనివాస వైన్స్‌లో మద్యం సేవించాడు. అతని స్నేహితులు తిరిగి వెళ్లినా, నర్సింలు రాకపోవడంతో కుటుంబసభ్యులు నర్సాపూర్‌కు వెళ్లి అతడి కోసం వెతికారు. శ్రీనివాస వైన్స్‌లోని సిట్టింగ్ గదిలో పడి ఉన్న అతడిని గుర్తించి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. సోమవారం నర్సింలు భార్య ఫిర్యాదు చేయగా, పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



శివకుమార్ (ఫైల్)

నర్సాపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నర్సాపూర్ పరిధిలో జరిగింది. తుజాల్‌పూర్‌కు చెందిన గాలి రమేష్ కుమారుడు శివకుమార్(22) డీజే సౌండ్, ఎలక్ట్రీషియన్ వ్యాపారం కోసం అప్పులు చేశాడు. వ్యాపారం సరిగా సాగకపోవడంతో కొన్నిరోజులుగా మనస్తాపంతో బాధపడుతున్నాడు. ఆదివారం ఇంట్లో చెప్పి తమ పొలంలోని పౌల్ట్రీఫామ్ వద్దకు వెళ్లాడు.రాత్రయినా శివకుమార్ ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో కుటుంబసభ్యులు పౌల్ట్రీఫామ్ వద్దకు వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో మరొకరు..

రాయపోల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా మనస్తాపం చెంది ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన రాయపోల్ మండలంలోని ఎల్కల్ గ్రామంలో చోటుచేసుకుంది. బేగంపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కుమ్మరి స్వామి(36) ఆదివారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుస్తుల దుకాణంలో షార్ట్‌సర్క్యూట్

● రూ.2 లక్షల నష్టం

నర్సాపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా వ్యాపారం బాగా జరుగుతుందని ఆశించిన దుకాణదారుడికి అగ్ని ప్రమాదంతో నష్టం వాటిల్లింది. నర్సాపూర్ ప్రధాన చౌరస్తాలో ఉన్న శ్రీసాయినాథ్ కలెక్షన్స్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా సోమవారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. సమీపంలోని వారు సమాచారం ఇవ్వగా అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల విలువైన దుస్తులు కాలిపోయాయి.

బాలుడి మృతికి కారణమైన క్లినిక్ సీజ్



సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌వో

మనూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం ఇంజెక్షన్ వికటించి ప్రశాంత్(14) అనే బాలుడు మృతి చెందిన ఘటనలో మనూరు మండలంలోని శెల్గిరా గ్రామంలోని క్లినిక్‌ను సీజ్ చేశారు. సోమవారం గ్రామాన్ని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్యారాణి, బాలుడి మృతికి గల కారణాలను కుటుంబసభ్యులను, గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా క్లినిక్ నడపడం నేరమని, ఆర్‌ఎంపీ డాక్టర్ ఇచ్చిన ఇంజెక్షన్ వికటించడం వల్లే బాలుడు చనిపోయినట్లు కుటుంబసభ్యులు చెప్పారని ఆమె తెలిపారు. ఆమె వెంట డాక్టర్ నర్సింగ్ చౌహాన్, ఎస్‌ఐ కోటేశ్వరరావు ఉన్నారు.

దివ్యాంగుడితో దురుసు ప్రవర్తన

● అదనపు కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని హక్కుల పోరాట సమితి డిమాండ్

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 22 : పింఛను కోసం వచ్చిన 100 శాతం దివ్యాంగుడితో సిద్దిపేట అదనపు కలెక్టర్ దురుసుగా ప్రవర్తించారని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జేసీపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం వారు సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ దుబ్బాక మండలం పెద్దచీకోడుకు చెందిన రెండు చేతులు లేని నాందిరి రవి పింఛను కోసం ప్రజావాణిలో అర్జీ పెట్టుకునేందుకు అదనపు కలెక్టర్‌ను కలిశాడు. తన సమస్యను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, వినకుండానే 'ప్రభుత్వం ఇచ్చినపుడు మాత్రమే వస్తుంది. రాజకీయం చేస్తున్నారా?' అంటూ దురుసుగా మాట్లాడారని ఆరోపించారు. ఒక బాధ్యత గల అధికారి సామాన్య ప్రజల పట్ల ఇలా వ్యవహరించడం బాధాకరమని విమర్శించారు. అదనపు కలెక్టర్ తీరుపై చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆయనను బదిలీ చేయాలని కలెక్టర్‌ను కోరారు.



గజ్వేల్ పట్టణంలోని మహంకాళి ఆలయంలో అమ్మవారిని చీరలతో అలంకరించిన దృశ్యం

మాత నమోస్తుతే!

దేవీ శరన్న వరాత్రోత్సవాలు ప్రారంభం.. ఆలయాల్లో విశేష పూజలు

- మర్పడగ క్షేత్రాన్ని సందర్శించిన కేసీఆర్ సతీమణి
- గజ్వేల్‌లో మహంకాళీ మాతకు 108 చీరలతో అలంకారం
- కేతకీలో కొలువుదీరిన దుర్గామాత
- ఖేడ్ లలితాంబికాదేవికి 4 కిలోల వెండి ఆభరణాలతో అలంకరణ

కొండపాక/గజ్వేల్/ఝరాసంగం/నారాయణఖేడ్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలను నిర్వహించారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడగ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్ సతీమణి శోభ అమ్మవారిని దర్శించుకున్నారు. మల్లికార్జునస్వామికి అభిషేకం నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకుడు, దేవీ ఉపాసకుడు డాక్టర్ చెప్పేల హరినాతశర్మ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలను చేశారు. గజ్వేల్‌లోని మహంకాళీ ఆలయంలో అమ్మవారిని 108 చీరలతో అలంకరించారు. సంగారెడ్డి జిల్లాలోని కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక మండపంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి అర్చకులు మంగళవాయిద్యాల మధ్య పూజలు నిర్వహించారు. తొలిరోజు అమ్మవారు మంగళగౌరీగా భక్తులకు దర్శనమిచ్చారు. నారాయణఖేడ్ పట్టణ శివారు మనూరు క్రాస్ రోడ్‌లోని లలితాంబికాదేవి అమ్మవారికి ఆలయ వ్యవస్థాపకుడు శ్రీపంతులుతో పాటు భక్తబృందం అమ్మవారికి సోమవారం నాలుగు కిలోల వెండి ఆభరణాలను అందజేయగా అర్చకులు అమ్మవారిని అలంకరించారు. భక్తులు దర్శనం చేసుకుని తరించారు.



ఝరాసంగం మండలం కేతకీ సంగమేశ్వరాలయంలో మంగళగౌరీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



మర్పడగలో విజయదుర్గామాతను దర్శించుకుంటున్న కేసీఆర్ సతీమణి



ఖేడ్‌లో ఆభరణాల అందజేస్తున్న శ్రీపంతులు

నీట్‌లో జహీరాబాద్ మైనార్టీ గురుకుల బాలికల ప్రతిభ



గాలి అనూష, తహసీన్‌ఖమర్

జహీరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని బూచనెల్లి గురుకుల కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు నీట్ ఫలితాల్లో ఆల్‌ఇండియా ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ రుబీనాబేగం తెలిపారు. గాలి అనూషా, తహసీన్‌ఖమర్, హప్సాపాతిమా, షహగుప్త షహీన్, షేక్‌సమీనా, ప్రియా ఏజింల్ ఆల్ ఇండియా ర్యాంకులను సొంతం చేసుకున్నారని, వారిని అభినందించారు. కళాశాల నుంచి 52 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, ఆరుగురికి ర్యాంకులు వచ్చాయని, మున్ముందు వెలువడే ఫలితాల్లో మిగతా విద్యార్థులు కూడా ర్యాంకులను సాధిస్తారని ఆమె ధీమాను వ్యక్తం చేశారు.



హప్సాఫాతిమా, షహగుప్త షహీన్, షేక్‌సమీనా, ప్రియా ఏజింల్

హుడా నుంచి మా భూములను టీజీఐఐసీకి బదలాయించండి



అదనపు కలెక్టర్ మాధురికి వినతిపత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

జిన్నారం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం జిన్నారం సహా జంగంపేట గ్రామాల్లో హెచ్‌ఎండీఏ లేఅవుట్ కోసం విలువైన భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురికి వినతిపత్రం అందజేశారు. సోమవారం సంగారెడ్డిలో జిల్లా అదన కలెక్టర్ మాధురిని జిన్నారం, జంగంపేట గ్రామాల రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. జిన్నారంలో 1, జంగంపేటలో 376 సర్వే నెంబరులో గల 180 ఎకరాల అసైన్డ్ భూములను 2022లో హెచ్‌ఎండీఏ లేఅవుట్ కోసం సేకరించారు. భూములు ఇచ్చిన రైతుకు ఎకరాకు 600 గజాల చొప్పున పరిహారం కింద పట్టాలు అందజేశారు. కాగా నాలుగేళ్లు గడుస్తున్నా, పరిహారం కింద అందజేసిన స్థలాలకు పొజిషన్లు చూపలేదని రైతులు అదనపు కలెక్టర్‌కు తెలిపారు. తమ భూములు తీసుకొని అన్యాయం చేసిన హెచ్‌ఎండీఏ సంస్థ నుంచి ఆయా భూములను టీజీఐఐసీకి బదలాయించి మెరుగైన పరిహారం ఇవ్వాలని కోరారు. మూడేళ్లుగా ఈ విషయమై కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదులు చేసినా, తమ సమస్య పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశం గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, యాదగిరి, వెంకటేశం, శ్రీనివాస్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

మాకొద్దీ రసాయన పరిశ్రమ

- మిర్జాపల్లిలో పరిశ్రమ ఎదుట గ్రామస్థుల ఆందోళన



పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి గ్రామంలో నిర్మిస్తున్న విషవాయువును వెదజల్లే రసాయన పరిశ్రమ మాకొద్దని గ్రామస్థులు పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగారు. సోమవారం గ్రామస్థులంతా కలిసి పరిశ్రమను ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేస్తూ నూతనంగా నిర్మిస్తున్న వినూత్న కెమికల్ పరిశ్రమ పనులను అడ్డుకున్నారు. గ్రామ పెద్దలకు ఎలాంటి సమాచారం అందించకుండా పరిశ్రమను నిర్మిస్తున్నారని యజామాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు పరిశ్రమలతో చర్మ వ్యాధుల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో పరిశ్రమను అడ్డుకుంటామని హెచ్చరించారు. పరిశ్రమ నిర్మాణంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

బీవీఆర్‌ఐటీతో జపాన్ యూనివర్సిటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలతో జపాన్ బృందం, చైర్మన్ విష్ణురాజు తదితరులు

నర్సాపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కాలేజీ జపాన్ దేశంలోని ప్రముఖ సాగ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ విష్ణురాజుతో పాటు జపాన్ నుం,ఇ వచ్చిన అతిథులు ప్రొఫెసర్ యూకియోనాగనో, అకిహీరోసుజుకితో కలిసి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం వల్ల విద్యార్థులకు ఇంటర్‌షిప్‌తో పాటు ఉపాధి అవకాశాలు విద్యాపరమైన అంశాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు. బీవీఆర్‌ఐటీ విద్యార్థులకు ఉన్నతవిద్య, ఉద్యోగ అవకాశాలు ఎక్కడ మెరుగుగా ఉంటాయో గుర్తించి అటువంటి అవకాశాలు కల్పించడమే ధ్యేయమని చైర్మన్ విష్ణురాజు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రవిచంద్రన్, వైపర్ ప్రిన్సిపాల్ రమేష్, డైరెక్టర్ సతీష్‌చంద్రతో పాటు పలువురు పాల్గొన్నారు.





నిజాంపేట మండలంలో కల్వకుంట-వెంకటాపూర్ దారిలో కొట్టుకుపోయిన లోలెవల్ కల్వర్టు, నార్సింగి వద్ద కోతకు గురైన రోడ్డు

రోడ్ల మరమ్మతుకు రూ.144.74 కోట్లు అవసరం

- తాత్కాలిక, శాశ్వత పనులకు ప్రతిపాదనలు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు రహదారులు దెబ్బతిన్నాయి. బ్రిడ్జిలు, కల్వర్టులు కొట్టుకుపోయాయి. చాలా చోట్ల కోతకు గురయ్యాయి. ఇందులో ఆర్‌అండ్‌బీ రోడ్లే ప్రధానంగా ఉన్నాయి. వాగులు ఉధృతంగా పారడంతో లోలెవల్ కల్వర్టులు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో తాత్కాలిక, శాశ్వత పనుల కోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పూర్తిస్థాయి మరమ్మతుల కోసం రూ.144.74 కోట్లు అవసరం.

నిధుల కోసం ప్రతిపాదనలు

మెదక్ జిల్లాలో ఆర్‌అండ్‌బీ రహదారులు 637.21 కిలోమీటర్లు, జాతీయ రహదారులు 189 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. మండలాలు, జిల్లా కేంద్రం, జాతీయ రహదారులు అనుసందానంగా ఉన్నాయి. మారుమూల ప్రాంతాలకు వెళ్లేందుకు ఇవే కీలకం. వర్షాలకు పాడైన రోడ్లను అధికారులు గుర్తించారు. పూర్తిస్థాయిలో మరమ్మతులకు కోసం రూ.144.74 కోట్లు, తాత్కాలిక మరమ్మతులకు రూ.3.40 కోట్లు అవసరమని ప్రతిపాదనలను పంపారు. పంచాయతీరాజ్ శాఖకు చెందిన 39 రోడ్లు, 45 కల్వర్టులు దెబ్బతిన్నాయి. తాత్కాలిక పనులకు రూ.కోటి, కల్వర్టులకు రూ.5.59 కోట్ల అవసరమని అంచనా వేయగా.. శాశ్వత పనులకు రూ.62.33 కోట్లు కోసం ప్రతిపాదనలు పంపారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఈఈ సర్దార్‌సింగ్‌ను సంప్రదించగా.. అంచనాలను ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు.

- మెదక్ నుంచి వెల్దుర్తి వరకు 19 కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా గుంతమయంగా మారింది.
- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లే మార్గం ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధ్వంసమైంది.
- మెదక్ మండల తిమ్మానగర్ నుంచి రాయిన్‌పల్లి వెళ్లే మార్గంలో రోడ్డు కొట్టుకుపోయింది. దాంతో తిమ్మానగర్, మక్తభూపతిపూర్, గుట్టకిందపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.
- జిల్లా కేంద్రం నుంచి తిమ్మక్కపల్లి- బాలానగర్ గ్రామాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ కూడలి సమీపంలో తారు తొలగిపోయి కంకర తేలి ఇబ్బందిగా మారింది.
- నర్సాపూర్ మండల పరిధిలోని కొండాపూర్-నత్నాయిపల్లి ప్రధాన రోడ్డు అస్తవస్తంగా మారింది
- చేగుంట మండల పరిధిలోని మక్కరాజ్‌పేట నుంచి గొల్లపల్లికి వెళ్లే రెండు కిలోమీటర్ల రోడ్డు గుంతలమయంగా మారింది. మోకాలు లోతు గుంతలు ఏర్పడడం వల్ల ప్రయాణం నరకంగా మారింది.
- నిజాంపేట నుంచి నస్కల్ వెళ్లే రోడ్డు భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. నిజాంపేట నుంచి చల్మెడ వెళ్లే మార్గం కోతకు గురైంది.
- నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట-వెంకటాపూర్ గ్రామానికి వెళ్లే రహదారి ఉన్న బ్రిడ్జి వరదలకు కుంగిపోయింది.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

- సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



హోంగార్డులకు రెయిన్ కోట్లు, జాకెట్లు అందజేస్తున్న ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం హోమ్‌గార్డులకు రెయిన్‌కోట్లు, ఉలెన్ జాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమ్‌గార్డులు కూడా పోలీసుశాఖలో అంతర్భాగమేనని పేర్కొన్నారు. వారికి ఎలాంటి సమస్యలు లేకుండా చురుకుగా విధులు నిర్వర్తించేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. హోంగార్డులకు వ్యక్తిగతంగా, డ్యూటీ పరంగా ఎలాంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మరో కార్యక్రమంలో పోలీసు సిబ్బందికి ఇంటి వద్దకే గ్యాస్ సిలిండర్‌ను పంపిణీ చేసే ఆటోను ఎస్పీ ప్రారంభించారు. అత్యవసర విధుల్లో ఉండే పోలీసులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. బుకింగ్ చేసిన తర్వాత రెండుమూడు రోజులైన రాకపోతే పోలీసు విభాగంచే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆటో ద్వారా సిలిండర్‌ను గృహ ద్వారం వద్దకు తీసుకువస్తారని పేర్కొన్నారు. అనంతరం తన కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమాల్లో అదనపు ఎస్పీ హెచ్ రఘునందన్‌రావు, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఆర్‌ఐలు రామారావు, రాజశేఖర్‌రెడ్డి, డానియల్ పాల్గొన్నారు.

'ఓపెన్' సప్లిమెంటరీ పరీక్షలు షురూ

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్, టెన్త్ సప్లిమెంటరీ(థియరీ)పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. సంగారెడ్డి పట్టణంలోని రెండు కేంద్రాల్లో తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన ఇంటర్మీడియట్ తెలుగు, హిందీ, ఉర్దూ పరీక్షకు 151 మందికి 115 మంది హాజరు కాగా, 36 మంది గైర్హాజరయ్యారు. టెన్త్ తెలుగు సబ్జెక్టుకు 57 మందికి 39 మంది హాజరు కాగా 18 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్మీడియట్ అరబిక్ సబ్జెక్టు పరీక్షకు 13 మందికి 12 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారు. టెన్త్ సైకాలజీ పరీక్షకు 100 శాతం హాజరు నమోదైందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా ఓపెన్ స్కూల్ పరీక్షల కమిటీ పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

250 యూరియా బస్తాలు పట్టివేత



పోలీస్ స్టేషన్‌లోని యూరియా వాహనం

టేక్మాల్, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా యూరియాను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి నమ్మదగిన సమాచారం మేరకు బొడ్మాట్‌పల్లి గ్రామంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణం నుంచి డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని టేక్మాల్ పోలీసులు పట్టుకున్నారు. అదులో 250 యూరియా బస్తాలున్నారు. వాహన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, సోమవారం ఉదయం మండల వ్యవసాయ అధికారికి వాహనాన్ని అప్పగించారు. ఈ వాహనంలో ఉన్న యూరియాను ఆకా సెంటర్‌లో ఉంచి సీజ్ చేశారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

టేక్మాల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని టేక్మాల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి నుంచి నాందేడ్ వైపు వెళ్తున్న ట్రాలీ ఆటోలో సుమారు 60 బస్తాల బియ్యన్ని తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం అందింది. ఈ మేరకు బొడ్మాట్‌పల్లి 161 జాతీయ రహదారిపై ఆ వాహనంపై దాడి చేసి పట్టుకోని సీజ్ చేశారు. అనంతరం టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అడివమ్మ ఒడిలో ఒదిగిన రామన్న

(5వ పేజీ తరువాయి)

మొదటి ఎన్‌కౌంటర్‌గా చెబుతుంటారు. నలుగురిని ఇక్కడ ఎన్‌కౌంటర్ చేయడంతో గిరాయిపల్లి దళం ఏర్పాటుకు బీజం పడినట్లయ్యింది. ఆ తర్వాత మేదినీపూర్ ఎన్‌కౌంటర్‌లోనూ ఆరుగురు నక్సల్స్‌ను పోలీసులు హతమార్చారు.

- సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌లో 88 మంది నక్సల్స్ అమరుల పేర్లతో భారీ స్థూపాన్ని 1990లో ప్రారంభించారు. 2000వ సంవత్సరంలో మాజీ ఎమ్మెల్యే బొప్పరాజు లక్ష్మీకాంతరావు ఇంటిని నక్సల్స్ కూల్చివేయగా గ్రీన్‌టైగర్స్ పేరిట ఈ స్థూపాన్ని నేలమట్టం చేశారు. ఆసియాలోనే అతిపెద్ద అమరుల స్థూపంగా పదేళ్లపాటు సందర్శనీయ స్థలంగా మారింది.
- మెదక్ జిల్లా పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌పై 1999లో పీపుల్స్‌వార్ గ్రూపు బాంబులతో దాడిచేసింది. ఈ ఘటనలో ఐదుగురు పోలీసులు చనిపోయారు. అప్పటి మంత్రి కరణం రాంచందర్‌రావు ఇంటిపైనా నక్సల్స్ దాడి చేయడం సంచలనమే.
- 1991లో హుస్నాబాద్ ప్రాంతంలోని రామవరం మందుపాతర ఘటనలో సీఐ యాదగిరి, ఎస్‌ఐ జాన్ విల్సన్, కానిస్టేబుళ్ల మరణించడం నేటికీ మరచిపోలేని సంచలనం.

మిగిలింది నలుగురే..

ఖాతా రామచంద్రారెడ్డి మృతితో ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రధానంగా సిద్దిపేట జిల్లాలో ఇక నలుగురే మిగిలారు. వివిధ స్థానాల్లో కొనసాగుతుండగా.. ఏ క్షణాన ఏ వార్త వినాల్సి వస్తుందోనని వారి కుటుంబ సభ్యులు బిక్కుబిక్కుమంటున్నారు.

- ధూళిమిట్ట మండలం కూటిగల్‌కు చెందిన కుంకటి వెంకటయ్య అలియాస్ శివన్న, అలియాస్ వికాస్ గత 30ఏళ్లుగా మావోయిస్టు పార్టీలో ఉన్నారు. పదో తరగతి పూర్తికాగానే అడవిబాట పట్టి ప్రస్తుతం దండకారణ్యం స్పెషల్ జోన్ సెక్రటరీగా ఉన్న వెంకటయ్యపై రూ.20లక్షల రివార్డు ప్రకటించారు.
- అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన కాశబోయిన స్వరూప 30ఏళ్ల క్రితం అజ్ఞాతంలో చేరింది. దండకారణ్యం సభ్యురాలిగా ఉన్న ఆమెపై రూ.లక్ష వరకు రివార్డు ఉంది. పదో తరగతి చదువుతున్నప్పుడే ఉద్యమానికి ఆకర్షితురాలై అడవి బాట పట్టింది.
- నంగునూరు మండల కేంద్రానికి చెందిన రంగు అరుణ అలియాస్ పద్మక్క 20ఏళ్లుగా మావోయిస్టుల్లో ఉన్నారు. ఛత్తీస్‌ఘడ్‌లోని దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీలో యాక్షన్ టీం మెంబర్‌గా ఉన్న పద్మక్కపై రూ.2లక్షల రివార్డు ఉంది. అరుణ తల్లి అనారోగ్యానికి గురై మంచం పట్టింది. తన కూతురు ఎక్కడుందో, ఎలా ఉందో తెలియదని చెబుతోంది.
- మిరుదొడ్డి మండలం ధర్మారంకు చెందిన రంగనబోయిన భాగ్య అలియాస్ కల్పన అలియాస్ రూపి 23 ఏళ్లుగా వివిధ హోదాల్లో మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం నార్త్ బస్తర్ ప్రతాపూర్ ఏరియా కమాండర్‌గా ఉన్న భాగ్యపై రూ.4లక్షల రివార్డు ఉంది.



కోహెడ మండలం తీగలకుంటపల్లిలోని రామచంద్రారెడ్డి ఇల్లు

నవశకానికి నాంది

(5వ పేజీ తరువాయి)

ఆయిల్ ప్యాకెట్లు బయటకు వస్తాయని హరీశ్‌రావు తెలిపారు.

సందర్శించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు..

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు వల్లనే పామాయిల్ ఫ్యాక్టరీ సాధ్యమైందని చెప్పారు. కానీ ఈ ఘనతను కాంగ్రెస్ వాళ్లు తమ ఖాతాలో వేసుకోవాలని చూడడం సిగ్గుచేటన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రసంగిస్తూ దేశంలోనే అత్యధికంగా వరి సాగు చేస్తున్న రాష్ట్రం తెలంగాణేనని.. ఇప్పుడు అదే బాటలో పామాయిల్ తోటలు ఉంటాయని అన్నారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఈ పరిశ్రమ కారణంగా పల్లెలు పట్టణాలు మారుతాయని వివరించారు. రైతులను రాజులుగా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్సీ యాదవరెడ్డి ప్రశంసించారు. మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్ ప్రసంగిస్తూ ఒకప్పుడు ఈ ప్రాంతానికి అమ్మాయిలను ఇచ్చి పెళ్లిచేయాలంటే ఆలోచించేవారని.. ఇప్పుడు పరిస్థితి మారిపోయిందని చెప్పారు. పట్టుదలతో హరీశ్‌రావు శ్రమించడం వల్లనే ఇది సాధ్యమైందని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి స్పష్టం చేశారు.



ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా

గీతంలో ప్రధానోపాధ్యాయుల జాతీయ సంగోష్ఠి

- పీఎస్ పీఏతో కలిసి ఈనెల 26, 27న నిర్వహణ

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మరో ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి కార్యక్రమానికి వేదిక కానుంది. ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం (పీఎస్ పీఏ)తో కలిసి ఈనెల 26, 27 తేదీలలో ప్రిన్సిపాల్స్ కొలోక్వియం - 2025ను నిర్వహించనుంది. 'ఉన్నత విద్యను తిరిగి ఊహించుకోవడం: నాయకత్వం, విధానం, ఆచరణ' అనే ఇతివృత్తంతో సాగే ఈ సంగోష్ఠిలో దేశంలోని ప్రముఖ సీబీఎస్‌ఈ, ఐబీ, జాతీయ పాఠశాలల నుంచి 150 మందికిపైగా విద్యావేత్తలు, విధాన నిర్ణేతలు, పరిశ్రమ నిపుణులు పాల్గొననున్నారు. పలువురు ప్రముఖులను ఆహ్వానించారు.

న్యూస్ బాక్స్

యూరియా కోసం బారులు

మిరుదొడ్డి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. పోలీసులు రైతులను క్యూలైన్లో నిలబెట్టి ఎలాంటి ఆటంకాలు ఎదురవకుండా చూశారు. వ్యవసాయాధికారి మల్లేశం ఆధ్వర్యంలో రైతులకు టోకెన్లను అందజేశారు.

నేడు ఇసుక డంపునకు వేలం

కొండపాక, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న ఇసుకను కొండపాక తహసీల్ కార్యాలయం ముందు డంపు చేశారు. ఈ ఇసుక డంపును ఈ నెల 23న బహిరంగ వేలం వేస్తున్నట్టు తహసీల్దార్ ఎర్రోళ్ల శ్యాం తెలిపారు. సుమారు పది ట్రాక్టర్ల ఇసుక డంపు చేశారు. వేలంపై ఆసక్తి గలవారు రూ.5వేలు డిపాజిట్ చేయాలన్నారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..

కొండపాక, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన సలేంద్రి జగన్ యాదవ్ అనారోగ్యంతో మృతి చెందాడు. జగన్ యాదవ్‌తో పాటు చదువుకున్న ఎస్సెస్సీ 1992-93 బ్యాచ్ మిత్రులు మృతుడి కుటుంబానికి అండగా నిలిచారు. ఈ మేరకు సోమవారం కుటుంబ సభ్యులను పరామర్శించి ఇద్దరు ఆడపిల్లల్లో ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున ఇద్దరి పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అదేవిధంగా ఒక క్వింటాల్ బియ్యం వంట సామగ్రి అందజేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రదర్శన

చేర్యాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీజనల్‌వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతికసారథి కళాబృందం సోమవారం చేర్యాల మండలం గుర్జకుంట గ్రామంలో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కళాకారుడు పిన్నింటి రత్నం, టీం లీడర్ పిల్లిట్ల శ్యామ్‌సుందర్‌లు ఆట, పాటలతో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా తదితర వ్యాధుల వలన కలిగే అనర్థాలను వివరించారు.

ముస్త్యాల యువకుడికి డాక్టరేట్


భానుచందర్

చేర్యాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్త్యాల గ్రామానికి చెందిన బంగారు భానుచందర్ ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ పొందారు. రంగనాథ రామాయణం, శ్రీమద్రామాయణ కల్పవృక్షంల తులనాత్మక పరిశీలన అంశం పట్ల పి.వారిజారాణి పర్యవేక్షణలో పరిశోధన జరిపి నివేదిక అందించారు. ఓయూ అధికారులు ఆమోదించి డాక్టరేట్ పట్టా అందజే శారు.

బీజేపీని విమర్శించే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదు

గజ్వేల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): బీజేపీని విమర్శించే అర్హత, స్థాయి బీఆర్‌ఎస్ నాయకులకు లేదని బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మాజీ చైర్మన్ భాస్కర్ ఇంట్లో విలేకరులతో మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ హయాంలో ఊర చెరువు మత్తడి నీళ్ల సమస్యను సృష్టించడంతో పాటు పరిష్కారం చూపలేకపోయారని, చెరువు నీటి అలుగుకు అడ్డుకట్ట వేసిందే బీఆర్‌ఎస్ నాయకులన్నారు. ఏ అర్హతతో వంటేరు విజయ్‌వర్ధన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారని ప్రశ్నించారు. గాడిపల్లి భాస్కర్‌ను విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు గాడిపల్లి అనూప్, కమ్మరి శ్రీను, నత్తి శివకుమార్, సుభాష్ చంద్రబోస్, చెప్యాల వెంకట్‌రెడ్డి, తదితరులున్నారు.

26న మహిళలకు 5కే రన్

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ జిల్లాలో బతుకమ్మ ఉత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 26న మహిళలకు 5కే రన్ నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జంగపల్లి వెంకట నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని జయశంకర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో ఉదయం 6.30 గంటలకు పోటీ ఉంటుందని చెప్పారు.

పంటల నమోదు

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సాగు చేసిన పంటల వివరాలను డిజిటల్ యాప్ ద్వారా వ్యవసాయ అధికారులు నమోదు చేస్తున్నారని మండల ఏవో వేల్పుల పూజ పేర్కొన్నారు. సోమవారం హుస్నాబాద్ మండలంలోని గాంధీనగర్‌లో క్షేత్రస్థాయిలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.

108 సిబ్బందిపై కినుక ఎందుకో?

- శిథిలావస్థలో ఉన్న భవనమే వారి ఆవాసం
- నిత్యం పాములు, తేళ్ల సంచారంతో గుబులు
- హుస్నాబాద్‌లో కనీస సౌకర్యాలకు నోచుకోని వైనం
- సౌకర్యాలతో కూడిన వేరే చిన్న గది అయినా సరిపెట్టుకుంటామంటున్న సిబ్బంది




హుస్నాబాద్‌లో 108 అంబులెన్స్ సిబ్బంది ఉండే శిథిల భవనం, సిబ్బంది ఉండే గది ఇలా..


ఇటీవల గదిలో చంపిన పాము

హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆపత్కాల పరిస్థితుల్లో అండగా నిలిచే 108 అంబులెన్స్ సిబ్బందికి హుస్నాబాద్‌లో రక్షణ కరువైంది. ప్రజల ప్రాణాలను రక్షించేందుకు రేయింబవళ్లు పని చేసే 108 సిబ్బంది శిథిలావస్థకు చేరిన క్వార్టర్‌లో భయాందోళనల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. కాలం చెల్లిన ఈ భవనంలో నిత్యం పాములు, తేళ్లతో సహవాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అంతే కాకుండా ఇందులో కనీస సౌకర్యాలు సైతం లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక సదుపాయాలు కలిగిన మరో చిన్న గదిని తమకు కేటాయించినా సరిపోతుందని వారు ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్నా..

హుస్నాబాద్‌లో 2007 సంవత్సరంలో 108 అంబులెన్స్ సేవలు ప్రారంభమయ్యాయి. అప్పుడు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వినియోగంలో లేని ఒక క్వార్టర్‌ను 108 సిబ్బందికి కేటాయించారు. అయితే 1956 సంవత్సరంలో నిర్మించిన భవనాలు కావడంతో అప్పుడే శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇటీవల హుస్నాబాద్‌కు మరో 108 అంబులెన్స్ వాహనాన్ని కేటాయించారు. ప్రస్తుతం హుస్నాబాద్ మండలానికి రెండు 108 అంబులెన్స్ వాహనాలతో పాటు నలుగురు డ్రైవర్లు, నలుగురు మెడికల్ టెక్నీషియన్లు (ఎంటీ) విడతల వారీగా విధులు నిర్వహిస్తున్నారు.

అన్నీ సమస్యలే..

ప్రస్తుతం 108 సిబ్బంది శిథిలావస్థకు చేరిన గదిలో ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ గది చుట్టు తుమ్మలు, తుప్పలు పెరిగాయి. వర్షం వస్తే ఊరుస్తుంది. ఇందులో టాయిలెట్స్, మరుగుదొడ్లు లేవు. కరెంట్ సౌకర్యం మొన్నటి వరకు లేదు. మంచినీటిని కూడా దగ్గరలోని ఆఫీసుకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుంది. ముఖ్యంగా చుట్టు చిత్తడి ఉండటంతో పాములు, తేళ్లు సంచరిస్తున్నాయి. ఇటీవల ఒక పామును 108 సిబ్బంది చంపారు. అన్ని హంగులు కలిగిన భవనం కాకున్నా కనీసం మౌలిక సదుపాయాలుండే ఒక గదిని ఇస్తే తమకు ఎంతో కొంత రక్షణగా ఉంటుందని సిబ్బంది కోరుతున్నారు. ఈ విషయంపై జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు వారు విన్నవించగా సమస్యను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.


భవనం పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు

వైద్య శిబిరాలకు విశేష స్పందన



జగదేవ్‌పూర్ మండలం తీగుల్ పీహెచ్‌సీలో, తొగుట ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలు

జగదేవ్‌పూర్/తొగుట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జగదేవ్‌పూర్ మండలంలోని తీగుల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి గ్రామస్థులతో పాటు పలు గ్రామాల ప్రజలు, రోగులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వైద్య శిబిరంలో ఎనిమిది రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆస్పత్రి వైద్యుడు రాజశేఖర్ మాట్లాడుతూ వైద్య శిబిరంలో పిల్లలకు, మహిళలకు, చర్మ వ్యాధిగ్రస్థులకు, కంటికి సంబంధించిన పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు, దంతాలు, మానసిక సంబంధిత వైద్య పరీక్షలతో పాటు జనరల్ వైద్య పరీక్షలు చేశామని తెలిపారు. శిబిరానికి సుమారు 300 మందిపైగా హాజరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు హిమబిందు, మహేష్, శ్వేతారెడ్డి, రాకేష్, కళ్యాణ్, హారిక, సంధ్య, తిరుపతి రెడ్డి, స్టాలిన్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా తొగుట మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 179 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యుడు రాధాకిషన్, సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన స్పెషలిస్ట్ వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులకు పండుగ పూట పస్తులు ఉండే దుస్థితి దాపురించిందని, పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి అధ్యక్షుడు ఎల్లయ్య పేర్కొన్నారు. సోమవారం గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 51 సవరించాలని పంచాయతీ సిబ్బందికి జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాల చెల్లింపుల చర్యలు చేపట్టాలని అన్నారు.

● **మిరుదొడ్డి:** రాష్ట్రప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ మిరుదొడ్డి మండల కార్యదర్శి అంజయ్య అన్నారు. సోమవారం మిరుదొడ్డిలో మాట్లాడారు. గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు మూడు నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పెండింగ్ వేతనాలను చెల్లించకుంటే ఆ కుటుంబాలకు పండుగపూట పస్తులు తప్పవన్నారు.

అద్దెబస్సు డ్రైవర్ల వేతనాలు పెంచాలి


నిరసన తెలుపుతున్న అద్దె బస్సు డ్రైవర్లు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట డిపోలో పని చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్ల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాల స్వామి, పబ్లిక్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలంటూ అద్దె బస్సు డ్రైవర్లు సోమవారం ఉదయం నాలుగు గంటల నుంచి విధులను బహిష్కరించి సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా గోపాలస్వామి, చొప్పరి రవికుమార్ మాట్లాడుతూ సిద్దిపేట డిపోలో అద్దె బస్సుల్లో 120 మంది డ్రైవర్లు పనిచేస్తున్నారన్నారు. రెండేళ్ల క్రితం చేసుకున్న వేతన ఒప్పందాలు పూర్తయిన సందర్భంగా అద్దె బస్సు ఓనర్లకు వేతనాలు పెంచాలని 50 రోజుల క్రితమే నోటీసులు ఇచ్చామని, అయితే నోటీసులకు ఎలాంటి స్పందన లేని కారణంగా సమ్మెలో పాల్గొన్నట్లు తెలిపారు. కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలని అద్దె బస్సు డ్రైవర్లు డిమాండ్ చేశారు. అద్దె బస్సు డ్రైవర్లు సమ్మెలో దిగి బస్సులు ఆపడంతో బస్సులలో ప్రయాణిస్తున్నవారు రోడ్డుపైనే నిలబడ్డారు. సమ్మెలో యూనియన్ ప్రధాన కార్యదర్శి దబ్బెట పరమేష్ ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డినీతో పాటు డ్రైవర్లతో నాగరాజు, అంజిరెడ్డి, రమేష్, రఫీ, దర్గయ్య, శ్రీనివాస్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ ఇరిగేషన్ శాఖకు 'చీఫ్' ఎక్కడ?

(5వ పేజీ తరువాయి)

ముందుకు రావడం లేదనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ఆగిన పనులు

చీఫ్ ఇంజినీర్ పర్యవేక్షణలో ఉండే రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లలో నీటి విడుదలకు సంబంధించిన ప్రోటోకాల్ అమలు, గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్ల నిర్మాణం, కాలువల పర్యవేక్షణ వంటి కీలక పనులన్నీ నిలిచిపోయాయి. 20 రోజులుగా గజ్వేల్ కార్యాలయానికి తాళం వేసి ఉంది. ఈ పరిస్థితి వల్ల ప్రాజెక్టు పనులు, నిర్వహణ కుంటుపడుతున్నాయని అధికారులు సైతం చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే సీఈని నియమించాలని స్థానిక ప్రజలు, అధికారులు కోరుతున్నారు.

జోరువాన

(5వ పేజీ తరువాయి)

కురిసింది. పట్టణంలోని గుండ్ల చెరువు వద్దనున్న డబుల్ ఇళ్లలోకి వరద నీరు చేరింది. ఇక పిడుగు పాటుకు చిన్నకోడూర్ మండలం, గంగాపూర్‌కు చెందిన పిరెల్లి ఐలయ్యకు చెందిన ఆవు మృతిచెందింది. జిల్లాలో గరిష్ఠంగా 90.5 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. వాతావరణశాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అవసరం అయితే తప్ప బయటకు రావొద్దని అధికారులు సూచించారు.

పేదల పెన్నిధి కర్ర శ్రీహరి


కర్ర శ్రీహరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేడం లింగమూర్తి, నాయకులు

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తన రాజకీయ జీవితమంతా పేదల కోసం పనిచేసిన మహానాయకుడు కర్ర శ్రీహరి అని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి పేర్కొన్నారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలో జరిగిన కోహెడ మాజీ జడ్పీటీసీ సీనియర్ నాయకులు కర్ర శ్రీహరి సంతాప సభలో పాల్గొన్న కేడం లింగమూర్తి మాట్లాడారు. శ్రీహరి అకాల మరణం హుస్నాబాద్ నియోజకవర్గంలోని రాజకీయ రంగానికి తీరనిలోటన్నారు. స్ఫూర్తి సంస్థ అధ్యక్షుడు పందిల్ల శంకర్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, చిత్తారి రవీందర్, ఎండీ అన్వర్, ఎగ్గిడి అయిలయ్య, బద్దిపడిగ రాజిరెడ్డి, కొయ్యడ కొంరయ్య, బూర వెంకన్న, పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, రవి పాల్గొన్నారు.

ఘనంగా భవానీ దీక్ష మాలధారణ

చేర్యాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని దుర్గమ్మ ఆలయంలో సోమవారం భవానీ దీక్షమాలధారణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మర్మాముల రామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో దుర్గమ్మకు విశేష పూజలు జరిపారు. అనంతరం మాలాధారణ జరిపి మాలాధారణ స్వాములకు నియమనిబంధనలు వివరించారు. దాదాపు వందమందికి పైగా మాలధారణ చేయడం విశేషం.


చేర్యాలలో చావడి వద్ద దుర్గాదేవికి పూజలు


జగదేవ్‌పూర్: కొండపోచమ్మ ఆలయంలో పూజలు


మద్దూరులోని ఓ మండపంలో ప్రతిష్ఠించిన దుర్గామాత


చిన్నకోడూరు మండలం రాముని పట్లలో ప్రతిష్ఠించిన అమ్మవారు

ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రులు

జిల్లావ్యాప్తంగా శరన్నవరాత్రులు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా ఆలయాలతో పాటు ప్రత్యేక అలంకరణతో ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గామాత విగ్రహాలు కొలువుదీరాయి. అంతకు ముందు భారీ దుర్గామాత విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి మండపాల్లో ప్రతిష్ఠింపజేశారు. ఊరేగింపు సందర్భంగా మహిళల కోలాటాలు, మంగళహారతులతో అమ్మవారిని స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలతో అమ్మవార్ల ఆలయాలు సందడిగా మారాయి.

- న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి)

ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి


అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

సిద్దిపేట సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా ఫిర్యాదుదారుల నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్‌తో కలిసి అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను ప్రజలనుంచి స్వీకరించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో భూ సంబంధిత, హౌసింగ్, ఆసరా పింఛన్లు ఇతర సమస్యలకు సంబంధించి మొత్తం మొత్తం 174 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌వో నాగరాజమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులకు పూర్తి వేతనాలు చెల్లించాలి


దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

దుబ్బాక, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పేషెంట్ కేర్, శానిటేషన్ స్వీపర్, సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.భాస్కర్ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రంను ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ హేమరాజ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని దుబ్బాక 100 పడకల ఆసుపత్రిలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పేషంట్ కేర్, శానిటేషన్ స్వీపర్లు, సెక్యూరిటీ తదితర విభాగాల్లో పని చేస్తున్నారని తెలిపారు. ఏళ్లు గడుస్తున్నా వారి సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 60 ప్రకారం రూ.15,600 వేతనం చెల్లించాలని, అయితే కేవలం రూ.11వేలు మాత్రమే చెల్లిస్తూ కాంట్రాక్టర్ మోసం చేస్తున్నాడన్నారు. వెంటనే పూర్తి వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ దుబ్బాక పట్టణ కన్వీనర్ కొంపల్లి భాస్కర్, నాయకులు ఎండీ సాజిద్, ఆసుపత్రి కార్మికులు తదితరులు పాల్గొన్నారు

యూరియా పంపిణీని పర్యవేక్షించిన అధికారి

కొండపాక, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కొండపాక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాన్ని జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి సోమవారం సందర్శించారు. పీఏసీఎస్‌లో జరుగుతున్న యూరియా పంపిణీని పర్యవేక్షించారు. అలాగే రైతులతో మాట్లాడుతూ పంటలకు సరిపడా యూరియా రైతులకు అందించడం జరుగుతుందని ఎవరు అధైర్యపడవద్దని తెలిపారు. గత సంవత్సరం వానాకాలంతో పోల్చితే ఇప్పటివరకు 200 మెట్రిక్ టన్నుల యూరియా అధికంగా కొండపాక మండలానికి సరఫరా చేశామన్నారు. నానో యూరియాతో కలిగే లాభాలను రైతులకు వివరించారు. వారి వెంట మండల వ్యవసాయ అధికారి శివరామకృష్ణ పీఏసీఎస్ ఈవో రాజు రైతులు ఉన్నారు.

బతుకమ్మ ఏర్పాట్లలో అధికారుల నిర్లక్ష్యం

చేర్యాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండుగ ఏర్పాట్ల పట్ల చేర్యాల మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆడపడుచులను అవమానపరచడం తగదని బీఆర్‌ఎస్ యూత్ నాలుగుమండలాల అధ్యక్షుడు శివగారి అంజయ్య, నాయకుడు పచ్చిమడ్ల సిద్దిరాములు పేర్కొన్నారు. సోమవారం వారు చేర్యాలలో విలే కరులతో మాట్లాడారు. మునిసిపల్ పరిధిలోని ప్రధాన చౌరస్తాలలో కనీసం విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రధాన చౌరస్తాలలో చీకట్లోనే బతుకమ్మ ఆడి ఇబ్బందులుపడ్డారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిద్రమత్తు వీడి బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో విద్యుత్‌దీపాలు ఏర్పాటుచేయాలన్నారు. అలాగే సద్దుల సందర్భంగా కుడిచెరువు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

పౌష్టికాహారం బాల్యానికి రక్షణ

దౌల్తాబాద్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం బాల్యానికి ఎంతో అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ భాస్కర్ అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజ మాట్లాడుతూ, చిన్నారులకు ఆటపాటలతో అంగన్‌వాడీ టీచర్లు విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అనిత, కళ్యాణి, వినోద, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఊర చెరువును రాజకీయం చేయడం సరికాదు

గజ్వేల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధి కోసం ప్రజ్ఞాపూర్ ఊర చెరువును బీజేపీ నాయకులు వాడుకోవడం దుర్మార్గమని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు డాకని భిక్షపతి, మన్నె వెంకటేశ్ పేర్కొన్నారు. ప్రజ్ఞాపూర్‌లో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. గాడిపల్లి భాస్కర్ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందేందుకు ఊర చెరువును వాడుకుంటున్నారని మండిపడ్డారు. తమ నాయకుడు ప్రతాప్‌రెడ్డిపై బురదజల్లడం మానుకోవాలన్నారు. బట్టలమిల్లు, చాకలి బాలయ్య షటర్ కబ్జా చేయడంతో పాటు ఆయిల్ బ్యారెల్ దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులు ప్రతాప్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా బీజేపీ నాయకులు బుద్ధి మానుకుని ఎంపీ రఘునందన్‌రావుతో నిధులు మంజూరు చేయించి కాలువల పునరుద్ధరణ చేయించాలని డిమాండ్ చేశారు. నాయకులు మల్లేశం, ఎల్ల వెంకటేశం, వంగరి నాగరాజు, అంకులుగారి ఉపేందర్, క్యాసారం కృష్ణ కాటు కళ్యాణ్, మహేశ్ ఉన్నారు.

ప్రజ్ఞాపూర్ ఊర చెరువును సందర్శించిన ఈఈ

గజ్వేల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజ్ఞాపూర్ ఊర చెరువును, డిస్ట్రిబ్యూటరీ కెనాల్, ఇటీవల వరద ప్రభావిత ప్రాంతాలను నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస్, డీఈఈ మోత్యానాయక్ సోమవారం సందర్శించారు. వరద నీటి ప్రాంతాల్లోని ప్రజలతో మాట్లాడారు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్, రోడ్డు నిర్మాణ సమయంలో కల్వర్టు నిర్మాణం లేకపోవడంతో నీరు రోడ్డుపైకి చేరుతుందన్నారు. త్వరలోనే రెవెన్యూ, మునిసిపల్, నేషనల్ హైవే అథారిటీ, పోలీసు అధికారులతో కలసి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేశిస్తామని తెలిపారు.

రేబర్తిలో స్వచ్ఛతాహీ సేవా

మద్దూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలంలోని రేబర్తిలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. బతుకమ్మ సంబరాల్లో భాగంగా గ్రామంలో పారిశుధ్యం, పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించినట్లు పంచాయతీ సెక్రటరీ మాధవ్‌జాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులను భాగస్వామ్యం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘాలతో పాటు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

బతుకమ్మ పాటల పుస్తకాల పంపిణీ


పాటల పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కొండపాక, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలం మర్పడగ విజయదుర్గాసమేత సంతాన మల్లికార్జునస్వామిక్షేత్రంలో అమ్మవారి నవరాత్రి మొదటి రోజు ఉత్సవ సందర్భంగా బతుకమ్మ పాటల పుస్తకాలను పంపిణీ చేశారు. లక్కిరెడ్డి విజయ శుభాకర్ రెడ్డి సంకలనం చేసి రచించిన బతుకమ్మ పాటల పుస్తకాలను క్షేత్ర నిర్వాహకుడు హరినాథ శర్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు.కార్యక్రమంలో స్థానిక మర్పడగ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బైరయ్య, మహిళా మోర్చా అధ్యక్షురాలు ఇర్రి ఉమా సురేష్ రెడ్డి పాల్గొన్నారు.